
# మహాభినిష్క్రమణం

కె.ఎన్.కుమార్



"జ్వరంతో అయోమయంలో పడివున్న కొడుకు నుదుటిని అప్పటికి పదిసార్లు పైగా పట్టి పట్టి చూశాడు రామయ్య. జ్వరం వచ్చి మూడు రోజులైనా తగ్గుముఖం పట్టలేదు. కళ్లు నీరసంతో వాలిపోయి కళ్ల కింద నల్లని చారలేర్పడ్డాయి తన పదేళ్ల కొడుకు వినోద్‌కి. ఏం చేసినా జ్వరం మాత్రం తగ్గే సూచన లేమీ కన్పించలేదు. ఏమీ తోచక అటూ ఇటూ తిరుగుతున్నాడు రామయ్య.

రామయ్యకు నలభై ఏడు ఏళ్ళు. బీదరికం వల్ల అరవై ఏళ్ల వృద్ధుడిలా కోల ముఖం, జీవితాన్నంతా చదివేసిన యోగిలా నుదుట రేఖలూ, బక్కపల్చని శరీరం. రామయ్య సాధారణ కుటుంబంలో, ఎక్కడో మారుమూల గ్రామంలో పుట్టినా, తల్లిదండ్రుల కష్టానికి ఫలితంగా పదివరకు చదువుకుని, ఆ చదువుతోనే ఏదో ఉద్యోగం




దొరుకుతుందని పట్నానికి వచ్చి, పట్నంలో ఉద్యోగాలు దొరకడం కష్టమని తేల్చుకుని, లారీలో క్లీనర్‌గా కొన్నేళ్ళు, ఆ తర్వాత ఎలాగోలా తన మంచితనం వల్ల ఆర్.టి.సి.లో డ్రైవర్ ఉద్యోగాన్ని పాతికేళ్ళు నిండాక గానీ సంపాదించుకోలేక పోయాడు. కొడుక్కి గవర్నమెంటోళ్లు ఉద్యోగం ఇచ్చారని సంబరపడిపోయి వెంటనే రామయ్యకు పెళ్ళి చేశారు రామయ్య తల్లిదండ్రులు. అప్పటికి రామయ్యకు 26 సంవత్సరాలు. తన భార్య లక్ష్మితో పట్నానికి వచ్చి కాపురం పెట్టాడు రామయ్య.

తన ఒక్కగానొక్క కొడుక్కి జ్వరం వచ్చి మూడ్రోజులైనా  తగ్గలేదని బెంగ పెట్టుకుని కూర్చుంది లక్ష్మి. మగాడినన్న ఆత్మస్థైర్యంతో పెళ్లానికి సర్ది చెపుతూ "కానీ లేవే, అసలే వర్షాలు, దానికి తోడు ఊర్లో మలేరియా వుందిట, ఇపుడేమైందని అంతగా ఏడుస్తున్నావ్. జ్వరం అంతేగా! డాక్టర్ కూడా సాధారణంగా వచ్చే జ్వరం అని చెప్పారుగా! ఆ మాత్రానికి ఎందుకింత బెంగపెట్టుకుంటావ్! లే లే! డ్యూటీ కెళ్లాలి, బట్టలు సర్దు" అన్నాడు రామయ్య. "ఏమండీ, బాబుకిలా వుంటే డ్యూటీ కెళ్తే నేనొక్కదాన్నే ఏం చెయ్యనండీ! ఈ రోజు కాస్త చూసుకుని, రేప్రొద్దున వెళ్తురు కానీండి! వెళ్ళి ఈ రోజు కూడా శెలవడిగి రండి' అంది పార్వతి.

"ఎలా కుదురుతుంది చెప్పు లక్ష్మీ! ఇప్పటికే వరుసగా మూడ్రోజులు లీవ్‌లో ఉన్నా. మళ్ళీ లీవ్ అడిగితే మా డి.యమ్. గారు కోప్పడతారు" అని పాకిస్తాన్‌కి ఇండియాకి ఇప్పట్లో సయోధ్య కుదరడం కష్టమని రాష్ట్రపతితో సర్దిచెప్తున్న రాయబారిలా చెప్పాడు రామయ్య.

"అది కాదండీ! అసలే ఈ మూడ్రోజులూ ఒక్క క్షణం కూడా నిద్రపోలేదు మీరు, పైగా ఈ తుపాను ఇప్పట్లో గట్టెక్కేట్లేదు. మీ రెళ్ళి మీ డి.యమ్. గారికి పరిస్థితి వివరించి ఇంకోరోజు లీవు పొడిగించమని చెప్పిరండి" అని వేడుకోలు ధోరణిలో చెప్పింది లక్ష్మి.

"మన కష్టాలు మనకెన్ని వున్నా కొందరి అవసరాలు ఎలా వుంటాయో కదా! ఎందరి కెంతెంత అర్జెంటు పనులో? ఎవరి ప్రయాణాన్ని ఎవరు ఆపగలరు లక్ష్మీ! నేనెళ్ళి ఓటివర్సు డ్యూటీ చేసొస్తా. మళ్లీ తర్వాత చూద్దాం! మొదట్లో నాకు అన్నం వడ్డించు టైమవుతుంది. డ్యూటీచార్ట్ ఈపాటికే వేసి ఉంటారు" అని చెప్పాడు రామయ్య.

ఇక చేసేది ఏమీ లేక మౌనంగా అన్నం వడ్డిస్తోంది లక్ష్మి. భార్య మౌనాన్ని గ్రహించి "చూడు లక్ష్మీ! బాబుకి తెల్ల మాత్ర ఒకటీ, పసుపు మాత్ర ఒకటీ, ఒక మూత టానిక్ ఇవ్వు. నేను వీలైతే లీవ్ అడుగుతా, లేదంటే డ్యూటీ కెళ్తాను" అంటూ సర్ది చెప్పాడు రామయ్య. మొక్కుబడిగా  భోంచేసి చెయ్యి కడుక్కున్నాడు. బయట వర్షం హోరు తగ్గనే లేదు. గాలి ఉధృతంగా ఉన్నట్టుండి వీస్తోంది. చెట్లన్నీ ఆ గాలికి వంగి వంగి లేస్తున్నాయి. రేడియోలో హెచ్చరికలూ, జాగ్రత్తలూ చెప్తున్నారు అపుడపుడూ. ఇవేమీ ఖాతరు చెయ్యకుండా మెడకు మఫ్లర్, చేతిలో గొడుగందుకుని డ్యూటీకి బయలు దేరుతూ 'బాబుని జాగ్రత్త' అని చెప్పి బయట పడ్డాడు రామయ్య.

బయట గాలి, వాన, ఉరుములవల్ల రాత్రి ఎనిమిదింటికే ఎక్కడా జనసంచారం లేదు. వీధులంతా మురికి నీరూ, వర్షపు నీటితో నిండి వున్నాయి. కుక్కలంతా అరచి అరచీ గొంతు మూగవోయిందేమో, ఓ మూల చెట్టు కింద మూల్గుతున్నాయి. సంక్రాంతి సంబరంలో పిల్లల కేరింతల్లాగా కప్పల అరుపులూ... ఇవన్నీ పట్టించు కునే స్థితిలో లేడు రామయ్య. మౌనంగా గొడుగు (చేత) పట్టుకుని, సంచీ భుజానికి వేలాడదీసుకుని వెళ్తున్న వాడల్లా ఎదురుగా కనిపించిన దృశ్యాన్ని చూసి నిశ్చేష్టుడయ్యాడు. మసక మసక వెలుతుర్లో ఓ చెట్టుకింద...బాల్యమో, యవ్వనమో... పసిపిల్లో, పడుచుపిల్లో తెలీని ఓ అమ్మాయి... "సెవంటీ పర్సంట్‌బాడీ తర్టీపర్సంట్‌క్లాత్"అన్న కార్టూన్‌లా... వంటి మీద అక్కడక్కడా చిరిగిపోయి అందీ అందని జాకెట్టు, మోకాళ్ళ వరకూ కుక్కలు పీక బడ్డట్లు గుర్తులుగా వేలాడుతున్న లంగాతో నిలబడుంది. ఏడ్చి ఏడ్చి కళ్ళు పీక్కుపోయుంది. కన్నీటి చారికలు ఆ వర్షంలో కూడా స్పష్టంగా కనబడుతూన్నాయి. ఎదురుగా ఓ అపరిచిత వ్యక్తి దగ్గరకు రావడంతో మరింత భయంతో కంపించి పోతూ ముడుచుకుంది. ఇంతకు ముందు జరిగిన సంఘటన తాలూకు సంబంధించిన భయమేదో వెంటాడుతుందని గ్రహించాడు రామయ్య. తనే మరింత చొరవ తీసుకుని ఆ అమ్మాయి దగ్గరకెళ్ళి "ఎవర్నువ్వు? ఎందుకిలా భయపడ్తున్నావ్? ఏం జరిగింది?" అంటూ ప్రశ్నించినా, సమాధానం మాత్రం చిక్కటి చీకటిలా నిశ్శబ్దమే. కొంచెంసేపటి తర్వాత మౌనంగా రోదిస్తూన్నట్లుగా ఆ అమ్మాయి కంట్లోంచి కన్నీరు...తనే మరింత దగ్గరకెళ్లి ఆ అమ్మాయి భయాన్ని గ్రహించి, తన సంచీలోని శాలువా తీసి ఆ అమ్మాయిపై కప్పి "ఏం భయం వద్దు! ఏం జరిగింది చెప్పు" అని భుజాన్ని పట్టుకుని అడిగాడు. కానీ ఆ అమ్మాయి ఏం సమాధానం చెప్పకపోవడంతో, మరింత భయపడుతున్నట్లు గ్రహించి, అక్కున చేర్చుకున్నట్లుగా ఆ



## లంచం

"ఏమిటి మన మేనేజర్‌గారు ఈవేళ అంత సీరియస్‌గా ఉన్నారు?"

'లంచం తీస్కోవడం కోసం బల్ల కింద చేయి పెట్టారట. ఆ వచ్చినవాడు చేతిలో ఐదు రూపాయలు పెట్టి. ఆయన బంగారు ఉంగరం కాస్తా లాక్కుపోయాడట!"


కె.వి.ఎం. రావు (గురజనాపల్లి)

అమ్మాయిని మౌనంగా ఏ ప్రశ్నలూ వెయ్యకుండా తనింటివైపు తిరిగాడు రామయ్య.

వెళ్ళిన కొద్దిసేపటికే తిరిగొచ్చిన భర్తను కంగారుగా చూస్తూ తలుపు తీసింది పార్వతి. "ఏమైందండి? ఎవరీ అమ్మాయి?" అనడిగినా, సమాధానం "నువ్వెళ్ళి స్టవ్ మీద కొద్దిగా వేడినీళ్లు పెట్టు, తర్వాత అన్నీ మాట్లాడుకుందాం?" అని భార్యను అవసరపెట్టాడు రామయ్య. వంటింట్లోకి వెళ్ళబోయిన లక్ష్మి ముందుగా ఆ అమ్మాయికి టవల్ తెచ్చిచ్చి తుడుచుకోమన్నట్లుగా సైగ చేసింది. ఆ అమ్మాయి కూడా మౌనంగా టవల్‌ని అందుకుని తనకేమీ భయం లేదనుకుని నిశ్చయించుకుని ఆప్యాయత నిండిన కళ్ళతో రామయ్యను చూసింది. కాని అప్పటికే లక్ష్మి వేడి నీళ్లు ఓ చెంబుతో పట్టుకుని, సబ్బు, పొడిబట్టలతో బాత్‌రూమ్ వైపు చూస్తూ, రమ్మన్నట్లుగా ఆ అమ్మాయిని కళ్ళతోనే సైగచేసింది. అది గమనించిన ఆ అమ్మాయి లక్ష్మిని అనుసరించింది.

అలసటగా కళ్లు మూసుకుని ఈ జీ ఛైర్‌లో పడుకున్న రామయ్య రేడియోలో చెబుతున్న వార్తలు విని నిటారుగా కూర్చున్నాడు. ఆ ఉలికిపాటుకు తనకు తానే భయపడుతున్నట్లు గ్రహించి, లక్ష్మిని తన దగ్గరకు పిలిచి "చూడు లక్ష్మీ! ఇప్పుడు మనింట్లో ఉన్న అమ్మాయి ఎవరో తెలుసా? మత పెద్దల కోపానికి, యువకుల పాశవిక చర్యలకు, పోలీసుల భయానికి బలైన ఓ బాలిక అని నా అనుమానం. నా ఊహ నిజమేమో ఆ అమ్మాయిని అడుగుదాం!" అన్నాడు. 'నా ప్రమేయం ఏముంది! అంతా నా విధిరాత' అంటూ అంతా విన్న ఆ అమ్మాయి భోరున మళ్లీ ఏడ్చింది. "నేను చేసిన పాపమంతా నేనో ముస్లిమ్ కులంలో పుట్టడమా? లేక అందరితో కలసి మెలసి ఉంటున్నందుకు నాకిచ్చిన ప్రతిఫలమా! నా పేరు అమీనా! మేముంటున్నది ఊరి చివర ఓ కాలనీలో, అక్కడ అన్ని కులాల వారున్నా ప్రత్యేకంగా ముస్లిమ్‌లంటూ మా ఒక్క ఇల్లే. కానీ అందరం కలసి మెలసి ఉండే వాళ్ళం. కానీ నిన్న ఎక్కడో ఎవరో ముస్లీం యువకుడు హిందూ స్త్రీని దారుణంగా చెరిపి, చంపారని మా ఇంట్లో వారందర్నీ వీధిలోకి లాగిలాగి తన్నారు, తరిమి తరిమి పొడిచి, వర్షపు నీటితోపాటు రక్త ప్రవాహం సృష్టించి, నన్నో ఆట బొమ్మని చేసుకుని తరిమి తరిమి చివరకు విరమించుకున్నారు" అంటూ ముగించిందా అమ్మాయి. "నీకేం భయం లేదు మేమున్నాం" అని ఓదార్పు చెప్పింది లక్ష్మి.

భార్యకు జాగ్రత్తలు చెప్పి రాత్రి గంట పన్నెండు కావస్తుండగా మళ్ళీ డ్యూటీకి వద్దన్నా బయలుదేరాడు రామయ్య. డిపోకి వెళ్ళేసరికి ఎక్కడ పాసింజర్లు అక్కడ పడి ఉన్నారు. బస్సులు ఏవీ నడవడం లేదట. పాసింజర్ల కంప్లైంట్లతో విసుగెత్తి




నట్టున్నాడు డి.యమ్. తను వెళ్ళి వెళ్ళగానే డి.యమ్. అర్జెంటుగా రమ్మన్నారని కండక్టర్ రాజు చెబితే డి.యమ్. రూమ్‌లోకి అడుగుపెట్టాడు రామయ్య. "రండి దొరగారూ! మీ కోసమే మేం చూస్తున్నాం!" అంటూ వెక్కిరింపుగా పలకరించాడు డి.యమ్.

"అది కాద్సార్, మా అబ్బాయికి ఒంట్లో బాగాలేదు. ఇంట్లో వేరే మగ దిక్కు లేదు, అందుకని శెలవు పెట్టాల్సి వచ్చింది. ఈ రోజు కూడా రాకూడదనే అనుకున్నా, కానీ ఎలాగోలా రాగలిగాను సార్. ఆలస్యమైంది. నేనీ వారం హాఫ్ లేకుండా కంటిన్యూ చేస్తాను సార్!" అంటూ జరిగిన దానికి క్షమాపణ చెప్తున్నట్లు చెప్పాడు రామయ్య. "ఏంటయ్యా బాగాలేదు, మాకూ పెళ్ళాం పిల్లలున్నారు. మేం డ్యూటీలకు రాలేదా! ఇక్కడ చూడు ఎంతమంది పాసింజర్లు గోల పెడ్తున్నారో! మళ్ళీ ఏదైనా అంటే యూనియన్‌లూ, సంఘాయిషీలూ అన్నీనూ! మరి ఈ రోజు 1672 కి వెళ్ళు. నీతో రాజుని వేస్తున్నా" అంటూ లాగ్ షీటుని తోశాడు. ఏదో గొణుక్కుంటున్నట్లుగా డి.యమ్. రూమ్ నుంచి బయట పడ్డాడు రామయ్య.

"ఏంది గురూ! మన డిపోలో జరిగేంత మోసం ఎక్కడా వుండదు. ఆ రామ్మూర్తి గాడైతే చెప్పా పెట్టకుండా వారం రోజులైనా డ్యూటీకి రాడు. పైగా ఆడికి ఆబ్సెంట్ కూడా వెయ్యరు. మరి ఆడు ఎంత మంత్రి రికమెండేషనైతే మాత్రం ఇలానా! మనమేం జేస్తి మన్నా ఆ డి.యమ్ గాడికి - మన మీద మండిపడ్తడు" అంటూ డి.యమ్.ని విసుక్కుంటూ చెప్పుకు పోతున్నాడు రాజు. ఇద్దరూ కాంటీన్ కెళ్ళి బస్సెక్కారు.


బస్సులో జనం కిక్కిరిసి ఉన్నారు. ఆ రూట్‌లో బస్సెళ్లి ఎనిమిది గంటలైంది. విడవని వర్షం కారణంగా బస్సుల్ని పంపడానికి భయపడ్తున్నాడు మేనేజరు. అందువల్ల ఎక్కడ బస్సులక్కడ గారేజీలో సగం, బ్రేక్ డౌను అయినవి సగం ఉండగా - తనను డ్యూటీకి వెళ్లమన్నందుకు డి.యమ్.నీ, ఇతర కండక్టర్లనీ తిట్టుకుంటూ టికెట్లు కొడుతున్నాడు రాజు. అయినా ఇవేమీ పట్టించుకున్నట్లుగా లేదు రామయ్య. ఏకాంతంగా రోడ్డు వైపునే...దృష్టి సారిస్తూ, వర్షంలోని చిక్కదనాన్ని చీల్చుకుంటూ కళ్లని పెద్దవి చేస్తూ, ఎక్కడో ఆలోచిస్తున్నాడు రామయ్య. తన బాల్యమంతా దరిద్రం, యవ్వనాని కొచ్చిం తర్వాత స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్‌లా జీవన భృతి కోసం పాకులాడాల్సి వచ్చింది. తన జీవితకాలంలో ఏనాడూ 'సుఖం'

## ఉప్పే డబ్బు

'ఉప్పు కాదిది ఆంగ్లేయుల పాలిటి నిప్పు' అనే వారుట ఉప్పు సత్యాగ్రహం రోజులలో లవణాన్ని గురించి మాట్లాడుకునేటప్పుడు. "ఉప్పులేని కూర వ్యర్థం రుచుల"కంటూ మరో మహాకవి తెలిపారు.

ఉప్పుకు ఇంత విలువ ఉండబట్టే కెన్యాకు దక్షిణంగా 200 కిలోమీటర్ల దూరంలో ఉండే జోర్గొండా గ్రామంలో నివసిస్తున్న ఆదివాసి తెగవారు కొన్ని ఆర్థిక లావాదేవీలకు ఉప్పునే డబ్బుగా వాడుకుంటూ ఉంటారు. వంద గ్రాముల ఉప్పును పది అమెరికన్ డాలర్లతో సమానంగా పరిగణిస్తారుట. అంటే మన భారతదేశపు కరెన్సీలో సుమారు వంద గ్రాముల ఉప్పు ఖరీదు 360 రూపాయలు!

సేకరణ: **పి.పి. వరప్రసాద్**
(నేలకొండపల్లి)




అన్నదాన్ని ఎరిగి ఉండలేదు. తన కోసం, తన కుటుంబసభ్యులు పడ్డ కష్టం, వేదనా, జీవిత కాలానికి సరిపోయే విషాదం. తన జీవితంలో పడిన కష్టాలను ఇక మరెన్నడూ ఎదురు కాకుడదన్న భయం. నిన్న జరిగిందానిలో ఏముందో తన కనవసరం. నేడే స్థితిలో ఉన్నాం. రేపే స్థితిలో ఉంటాం అన్న దాన్ని దృష్టిలో ఉంచుకుని డబ్బును అతి పొదుపుగా వాడుతున్నా, మళ్ళీ రేపటి భయం??! ఇదంతా ఆలోచిస్తూనే ఏకాగ్రతగా డ్రైవింగ్‌పై దృష్టి సారిస్తున్నాడు. నిద్ర ఒక వైపు ముంచుకొస్తున్నా టవల్‌ని చుట్టి ముక్కులో దూర్చి అలర్ట్‌గా ఉండటానికి తుమ్ముతున్నాడు రామయ్య. బయట ఉద్ధృతమైన గాలి, వర్షం పడుతూంది. ఉన్నట్టుండి బస్సు ఆగడంతో బస్సులో ప్రయాణికులు అందరూ ఒక్కసారిగా డ్రైవర్ వైపు చూశారు. "ఏమైందయ్యా! అసలే అర్ధరాత్రి, వర్షం, త్వరగా పోనీయండయ్యా!" అంటూ ఓ పెద్దాయన వెనక నుంచి అరుస్తున్నాడు. "హెడ్ లైట్లు పని చెయ్యడం లేదయ్యా బాబూ! ఇప్పుడెలాగా? ఈ రాత్రిలో, ఈ అడవిలో బస్సుని వదలి ఎలాగూ వెళ్లలేం, ఏదీ వాహనాలూ రావడం లేదు ఎలాగ?" అంటూ ప్రయాణికుల వైపు తిరిగాడు రామయ్య. బస్సులో కొందరు ఆడవాళ్ళు గుండెలు బాదుకున్నారు, దొంగలుంటారేమోనని. కొందరు దేవుళ్ళకి మొక్కుకున్నారు కాపాడమని. కొందరు పట్టుదలగా "ఏమీ కాదు లేండయ్యా మీకు తెల్సిన రూటే కదా! పోనీయండి - టౌనుకు చేరుకున్నాక వేరే మార్గం ఆలోచిస్తాం" అంటున్నారు కొందరు యువకులు. ఏదీ అర్థంకాక తలపట్టుకు కూరున్నాడు రామయ్య.

"ఏంటయ్యా పెద్ద యోగిలా ఆ పోజు, నీకే చెప్తున్నాం. బస్సుని పోనీ ఏం కాదులే" అని అరవడం మొదలు పెట్టారు ప్రయాణికులు. ఉరుములూ, మెరుపుల వెల్తురూ. తన సర్వీసును ఉపయోగించి బస్సుని నెమ్మదిగా పోనిస్తున్నాడు రామయ్య. కళ్లు పచ్చిపుండుల్లా మండుతున్నాయి. గత మూడు రోజులూ నిద్రలేమి వల్ల ఒళు అలసటగా ఉంది. అయినా చేసేది లేక డ్యూటీకి రావాల్సి వచ్చినందుకు తనమీద తనకే జాలితో స్టీరింగ్ తిప్పుతున్నాడు. ఇంతలో... ఎదురుగా నూరు మీటర్ల దూరంలో లారీ హెడ్ లైట్ల వెలుతురులో ఇద్దరు చేతులూపుతున్నారు ఇటువైపు రావద్దని. మధ్యలో ఒక ఇరవై మీటర్ల వంతెన. వంతెన మీదుగా హోరున వర్షపు నీరు ప్రవహిస్తూంది. నురగలు కక్కుతూ దొర్లే ఆ నీటి ప్రవాహాన్ని చూస్తే కళ్లు తిరిగినట్లనిపించి బస్సుని ఆపుచేసి పరిస్థితి వివరించి ప్రయాణికులకు చెప్పాడు రామయ్య. అయినా కూడా "ఆ లారీ గాడ్లదేం బోయిందట, వాళ్ళకేం బాగా తాగి రెస్టు తీసుకునేందుకు అలా లారీ పక్కనుంచి నిద్ర బోతుంటరు. నువ్వు గానీవయ్యా!" అంటూ డ్రైవర్‌కి సర్ది చెప్పి మళ్లీ బస్సుని నడిపించారు. చేసేది లేక మెల్లగా నడిపిస్తున్నాడు రామయ్య. వేగంగా రెయిలింగ్‌కు అనుకుంటూ వచ్చే నీటి వల్ల ఒక్కసారిగా బస్సు రెండు పొర్లింపులు పొర్లి పూర్తిగా తలకిందులై బ్రిడ్జి కిందకు వెళ్ళింది. అంతకూ సాక్ష్యం లారీ వాళ్లే. చేసేది లేక అలాగే కొంత సేపు నిల్చుని, మళ్లీ వెనకు వెళ్లి దగ్గరలో పోలీసు స్టేషనులో సమాచారాన్ని తెలిపారు.

ఉదయం తెలతెలవారు తుండగా పోలీసు హారన్లూ, ప్రెస్ ఫోటోగ్రాఫర్లూ, అంబులెన్స్‌లూ, అధికారులూ, సిబ్బందీ, క్రేన్‌లతో సహా ఆ ప్రదేశమంతా కిక్కిరిసి పోయింది. ప్రెస్ ప్రశ్నలకి అధికారులు సమాధానం చెప్పలేక పోతున్నారు. బస్సు వాగులో పడిందన్న వార్త విని చుట్టు పక్కల ప్రజలు అప్పటికే గుంపు చేరిపోయారు. క్రేన్‌తో బస్సును వెలికి తీస్తున్నారు. అందరూ ఆ ఘోరాన్ని చూడలేక కళ్లు మూసుకున్నట్లు మూసుకుని, మళ్లీ చూస్తున్నారు. డ్రైవర్ సీట్లో రామయ్య అలాగే స్టీరింగ్ మీద వాలి, అలవోకగా చెట్టు నీడలో లారీ నిలబెట్టి సేద తీరుతున్న డ్రైవర్‌లా వంగిన వాడల్లా శవమై, ఉబ్బిపోయాడు. మరి కొందరి శవాలు బస్సులో నుంచి మళ్లీ నీళ్లలో పడ్డ దృశ్యాన్ని ఫోటో తీస్తున్నారు ప్రెస్ వాళ్లు. అధికారులు ఆ దృశ్యాన్ని చూడకూడదన్నట్లు కర్చీఫ్‌ని ముఖానికి, కళ్లకు, అడ్డంగా పెట్టుకున్నారు. ప్రజల ఆర్తనాదాలు, మరి కొందరి స్త్రీల ఏడుపులూ ఆ ప్రదేశామంతా ఒకే గోలగోలగా ఉంది. ఇవన్నీ తన వల్లే జరిగిందని 'ఆత్మ నిందని' వేసుకున్నాడు డి.యమ్. చేసేదేమీ లేకుండా మౌనంగా రోదిస్తూ అధికారదర్పంతో ఆజ్ఞలు జారీ చేస్తున్నాడు డి.యమ్.

కానీ, పుట్టినప్పటి నుంచీ ఓ జీవితకాలం వరకూ సుఖాన్ని చవిచూడని ఓ అభాగ్యుడు నేడు నీళ్ల పాలయినాడు. ఎప్పటికైనా సుఖం దొరుకు తుందన్న ఆశతో జీవిస్తాడు మనిషి. కానీ జీవిత కాలమంతా శ్రమించి తన వాళ్ల కందరికీ దూరమైనాడు రామయ్య. అతడేమో రాముడూ కాదు, అశోకుడూ కాదు, అక్బరూ, యేసువూ కాదు. తన వల్లనైన సహాయం ఇతరులకు చెయ్యగలిగే ఓ సగటు మనిషి. అధికారుల శాసనాలకీ, నిర్లక్ష్యానికి బలైపోయిన ఓ అభాగ్య జీవి... ఇలాంటి రామయ్యలు ఎందరో......?

**(గత సంవత్సరపు వర్షాకాలంలో వరుసగా నీళ్లలో పడిపోయిన బస్సులు పడిపోవడానికి కారణాలేమై ఉంటాయని... ఆలోచించి.)**



**పొరపాటు**

'సీసాలోని నిద్ర మాత్రలన్నీ పొరపాటున నాలుగో నెంబరు పేషెంటుకే ఇచ్చేశాను డాక్టర్!'

'స్టాకులోంచి మరొక సీసా తీసుకొని తక్కిన పేషెంట్లకు ఇవ్వు సిస్టర్. ఆ సీసా ఖరీదు నాలుగో నెంబరు పేషెంటు బిల్లులో వేసెయ్యి.'

'ఆ?!'

**వి.వి. సీతారామ్‌దాస్** *(గుంటూరు)*